క్లుప్తంగా

వయ్యకల్లు ఊరచెరువు బహిరంగ వేలంపాట

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామంలో వచ్చే నెల 1వ తేదీన ఉదయం 11 గంటలకు ఊరచెరువు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. బహిరంగ వేలంపాటలో పాల్గొనే వారు రూ. 25 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంపాటలో అధికారులదే తుది నిర్ణయమన్నారు.

ఎంపీపీ స్కూలుకు కంప్యూటరు వితరణ



నూజెండ్ల: మండలంలోని పాత చెరువుకోమ్ము పాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు రూ.40 వేల విలువ చేయు కంప్యూటరును వితరణ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అభ్యున్నతికి దాత నూజెండ్ల వాసి జడ్డా సుబ్బారావు తమ వంతు సహాయంగా కంప్యూటరు బహూకరించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధిక, నాగమణి, ఏడుకొండలు, యాసిన్ పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి



నూజెండ్ల: పంచాయతీ కార్యదర్శులు వారికి కేటాయించిన గ్రామాలను సందర్శించి క్లాప్ మిత్రలు పనితీరు, ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తా సేకరించే విధానాన్ని పరిశీలించాలని ఎంపీడీవో పావులూరి ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఐనవోలు గ్రామంలో పారిశుద్ధ్య పనులను డ్రెయినేజీ కాల్వ పరిశీలించి క్లాప్‌మిత్రలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో శానిటేషన్ పనుల్లో ఆలసత్వం చేయకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రధాన కూడలి మార్గాల్లో చెత్తా చెదారం ఉంచరాదని, మురుగుకాల్వలు ఎప్పుడుకప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. శానిటేషన్ పనుల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈవోపీఆర్‌డి షేక్ రబ్బాని, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు



వినుకొండ: గంజాయి విక్రయిస్తున్న ఓమహిళతో పాటు మరోవ్యక్తిని వినుకొండటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. టౌన్ ఎస్సై సమీర్ బాషా కథనం ప్రకారం పట్టణంలోని మసీదుమాన్యంకు చెందిన పులినాగేంద్రం, శీలం నాగరాజు అనేవ్యక్తులు గంజాయి అమ్ముతుండగా పక్కా సమాచారంతో రైడ్‌చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెవిదిద్దులు చోరీకి యత్నం



శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ శివారు గ్రామము కృష్ణాపురంలో వృద్ధురాలి చెవిదిద్దులు చోరీ చేయబోయిన ఇరువురు వ్యక్తులు పోలీసులు అరెస్టు చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్లమూడి వెంకటరమణ శుక్రవారం ఆరుబయట మంచంలో కూర్చొని ఉండగా అదే గ్రామానికి చెందిన ఇరువురు యువకులు బలవంతంగా చెవిదిద్దులు లాక్కోని పారిపోబోయారు. వెంటనే ఆమె కేకలు వేయటంతో చుట్టుపక్కల నివాస గృహాల వారందరు నిందితులను పట్టుకొని స్థానిక పోలీసు స్టేషనులో అప్పగించారు. ఈఘటనలో బాధితురాలు కుడి చెవికి గాయాలయ్యాయి. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎంఈవో డి.బ్రహేశ్వరరావు

రొంపిచర్ల : విద్యార్థులు చుట్టా, బీడీ, గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంఈవో డి.బ్రహేశ్వరరావు అన్నారు. మండలంలో గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరల్డ్ నో టుబాకో డే సందర్భంగా రొంపిచర్ల ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మద్యం, గంజా యి, డ్రగ్స్ వంటి వాటిని సేవించడం వలన అనారోగ్యానికి గురై జీవితాలు పాడైపోతాయన్నారు. వీటి వలన కలిగే దుష్పరిణామాలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిని 9వ తరగతి విద్యార్థిని డి.ఎల్. నరసమ్మ, రెండవ బహుమతిని 8వ తరగతి విద్యార్థిని పాలవెల్లి అమూల్య, మూడవ బహుమతిని 7వ తరగతి విద్యార్థిని టి. రేవతి గెలుచుకున్నారు. విజేతలకు ఎంఈవో బ్రహ్మేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వై.హనుమంతరావు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో, హెచ్ఎం, వైద్యాధికారి

ఉపాధ్యాయురాలు వెంకాయమ్మ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

శావల్యాపురం: అంకిత భావంతో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు ప్రజల మన్ననలు పొందుతారని ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని కనమర్లపూడి గ్రామం ప్రధాన ఎంపీపీ స్కూల్లో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు గంగవరపు వెంకాయమ్మ అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ 35 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో మెరుగైన సేవలు అందించి ఎంతోమంది విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన గంగవరపు వెంకాయమ్మ–బెజవాడ నాగేశ్వరరావు దంపతులను పూలమాలల దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎఎస్.రామకృష్ణ, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ఎస్టీయూ నేతలు బిళ్లా రాజారమేష్, వెంకటరత్నం, జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయ లక్ష్మి, కుమ్మరి శ్రీనివాసరాజు, పి.శ్రీని వాసరావు, గ్రామస్తులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వెంకాయమ్మ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వాసవీ మాతకు ఆషాఢ సారె సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి ఆషాఢమాస సారె సమర్పించారు. కార్యక్రమంలో 125 మహిళలు అత్యంత వైభవంగా అమ్మవారి నగరోత్సవం నిర్వహించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి 58 రకాల పూలు, గాజులు, చీరలు, జాకెట్ ముక్కలు, గోరింటాకు ప్యాకెట్స్, పిండి వంటలు అమ్మవారికి సారెగా సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కొత్తమాసు మెహర్ బాబు, కార్యదర్శి కొత్తమాసు వెంకటప్పయ్య, కోశాధికారి పొత్తూరి లక్ష్మీప్రసాదరావు, మారుతి కృష్ణ, రెడ్డి శ్రీనివాసరావు, కొత్త హనుమంతురావు, మురారిశెట్టి పద్మ, యక్కల సుజాత, కొత్తూరి లక్ష్మీ, చలువాది బ్రహ్మయ్య, చేగు వెంకటేశ్వరరావులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.



పట్టణంలో నగరోత్సవంలో పాల్గొన్న మహిళలు

పేద విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయం

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట: పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. పఠాన్ చినసత్తార్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పఠాన్ యూసుఫ్ పలువురు పేద విద్యార్థులకు ట్రస్టు తరుపున రూ. 2 లక్షలు ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బీటెక్ విద్యార్థిని చిలువూరి పరమేశ్వరికి రూ. 50వేలు, ఇంటర్ విద్యార్థిని శ్రీలక్ష్మికి రూ. 50వేలు, ఎనిమిదో తరగతి విద్యార్థిని షేక్ సబిహాకు రూ.50వేలు, బీటెక్ విద్యార్థిని షేక్ ధనియా సుల్తానాకు రూ. 25వేలు, షేక్ ఆరీఫ్ అనే బాలుడికి ఆరోగ్య అవసరాల కోసం రూ. 25వేలు అందించారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పఠాన్ యూసుఫ్‌ఖాన్

అంగన్‌వాడీలకు వంటసామాన్లు అందజేత

నరసరావుపేట: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు వంటసామాన్లు ఇండక్షన్ స్టవ్, కుక్కర్లు, కడాయి పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు మంచి పోషకాహారాలను అందజేసి బరువు తక్కువ లేకుండా చూడాలని సూచించారు. శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉమాదేవి మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఎటువంటి అశ్రద్ధ చేయవద్దని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సూచించారు. అదేవిధంగా ఐదుగురు గర్భిణులకు సీమంత వేడుకలు నిర్వహించారు. ఏసీడీపీఓ బి.మాణిక్యరావు అధ్యక్షత వహించగా ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇండక్షన్ స్టవ్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

వీరభద్రస్వామి దేవాలయంలో చోరీకి విఫలయత్నం



ముళ్ల పొదల్లో స్వామి వారి విగ్రహం



దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో గురువారం రాత్రి దొంగలు ప్రవేశించి ఆలయంలో విలువైన విగ్రహాలను దొంగిలించే ప్రయత్నం చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను దొంగలు తీసుకొని వెళ్తుండగా చుట్టుపక్కల వారు మెలకువతో ఉండడం, కుక్కలు మొరగడంతో వారు దొంగిలించిన వస్తువులను ఆలయం పక్కనే ఉన్న ముళ్ల పొదల్లో వదిలి వెళ్లారు. గ్రామస్తుల ఈ విషయమై రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మణికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పొదల్లో ఉన్న విగ్రహాలను వెలికి తీశారు. క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకొని నమూనాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజీ కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలి

నాదెండ్ల: జాతీయ లోక్ అదాలత్ జులై 5న చిలకలూరిపేట న్యాయస్థానంలో జరగనున్నందున రాజీపడదగ్గ కేసులు పరిష్కరించుకోవాలని ఎస్సై జి. పుల్లారావు సూచించారు. మండల పరిధిలో 35–40 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పటికే పలు కేసులు రాజీపడేందుకు కక్షిదారులు సిద్ధమయ్యారన్నారు. మిగిలిన కేసుల పరిష్కారానికి కక్షిదారులు చొరవ తీసుకోవాలన్నారు. గ్రామంలోని పెద్దల సమక్షంలో మాట్లాడుకుని కేసులు పరిష్కరించుకోవాలన్నారు. సివిల్, కుటుంబ, ఆర్థిక పరమైన కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఏ న్యాయస్థానంలో కేసు నడుస్తుందో ఆ న్యాయస్థానం పరిధిలో జరిగే లోక్ అదాలత్‌లో రాజీ చేసు కోవాలని సూచించారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయం, డబ్బు వృధా చేసుకొని నష్టపోవద్దన్నారు. గ్రామాల్లో కలిసికట్టుగా శాంతియుత వాతావరణంలో మెలగాలన్నారు.

కొఠారి నిర్మలకు ఇంజినీరింగ్ పీహెచ్‌డీ



చిలకలూరిపేట: పట్టణంలోని పురుషోత్తమపట్నంకు చెందిన కొఠారి నిర్మలకు తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ లభించింది. ఈ మేరకు ఆమె యూనివర్శిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జిమినేషన్స్ డాక్టర్ వి.రాజా మాణిక్యం నుంచి ఈ నెల 25న ఉత్తర్వులు అందుకున్నారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఉషారాణి పర్యవేక్షణలో నిర్మల పరిశోధన చేశారు. సమ్ స్టడీస్ ఆన్ అథెంటికేషన్ అండ్ ప్రైవసీ ఇష్యూస్ ఫర్ మెడికల్ డేటా ఇన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్ అనే పరిశోధనకు గాను ఆమెకు పీహెచ్‌డీ లభించింది. కొఠారి నిర్మల పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో అధ్యాపకురాలిగా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను పీహెచ్‌డీ సాధించేందుకు గైడ్ చేసిన డాక్టర్ ఎస్ ఉషారాణి, యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతినాయుడు, వైస్ ఛాన్సలర్ ఆచార్య సి అప్పారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐడీపీఎస్‌లో ఎన్‌సీసీ విభాగం ప్రారంభం



నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేటలో కొనసాగుతున్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్(ఐడీపీఎస్) లో 2025–26 ఏడాది గాను ఎన్‌సీసీ విభాగాన్ని శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఉద్దేశ్యంతో పాఠశాల నందు ఎన్‌సీసీ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ రేఖ పులేకర్ తెలిపారు. శారీరక పరీక్షలు, మానసిక పరీక్షలు, రాత పరీక్షల ఆధారంగా ఎంపిక ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ సుబేదార్ రవీంద్ర, హవల్దార్ సంషేర్‌సింగ్, ఐడీపీఎస్ చైర్మన్ డా.నాగోతు ప్రకాష్, డైరెక్టర్ నాగోతు సబిత, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కే రాజు, పాఠశాల ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఎమ్.భూపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి



రాజుపాలెం: మండలంలోని పెదనెమలిపురి గ్రామ సచివాలయం–2 వద్ద దేవరంపాడు జీసస్ క్రైస్ట్ ప్రేయర్ టెంపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని వారు కోరారు. చెట్లు ఎక్కువగా ఉన్న ప్రదేశంలో వర్షాలు ఎక్కువగా పడతాయని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పాగళ్ల పూర్ణచంద్రరావు, వైస్ చైర్మన్ కోట బాబూరావు, కార్యదర్శి రమేష్‌రెడ్డి, జాన్, అబ్రహం, సామేలుబాబు, నన్నేపాముల చంద్రశేఖర్‌బాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజారావు, మహిళా కార్యదర్శి లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో బలోపేతానికి ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాలని ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు అన్నా రు. శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 2025–26 నూతన విద్యా సంవత్సరంలో అన్నీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుదలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ పారదర్శకంగా అమలు జరిగేలా క్షేత్రస్థాయిలో ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు సమయ భావం పాటించటంతో పాటు సకాలంలో హాజరు వేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెను ప్రకారం అమలు జరగాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు 2228 మంది విద్యార్థులకు మంజూరు చేసిందన్నారు. యూనిఫాం, బూట్లు కూడా అందరికీ త్వరలో వస్తాయన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ–2 పుసులూరి లలితాకుమారి, జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలూరులో రేణుకమ్మ కొలుపులు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీరేణుకమ్మ తల్లి కొలుపులు ఘనంగా ప్రారంభించారు. కొన్ని సంవత్సరాల నుంచి కొలుపులు నిర్వహించటం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. శుక్రవారం తొలిరోజు కొలుపులు వేడుకలు సందర్భంగా ప్రకాశం జిల్లా చీరాల సమీపాన ఉన్న కొత్తపట్నం సముద్రరేవుకు విగ్రహాలను తరలించి సముద్ర స్నానానికి చేయించారు. రాత్రికి మేళాతాళాలతో జలాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. రెండవ రోజు శనివారం మాతుడుపు సంబరంతో అమ్మవారిని దేవాలయానికి తరలిస్తారు. ఈనెల 26న చివరిరోజు ఆదివారం సాయంత్రం జమ్మి పూజ, వివిధ రకాల పూజ కార్యక్రమాలతో ముగుస్తాయన్నారు.



సముద్ర స్నానానికి తరలింపు తరలివెళ్లిన భక్తులు

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రొంపిచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న తహసీల్దార్ బండి నిర్మల మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశాల మేరకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చున్నారు. రక్తదానం చేయడం వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండవన్నారు. ఈ శిబిరం ఏర్పాటుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రక్తదాన శిబిరంలో 26 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీవో కె.మ్యాథ్యూబాబు, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ కె.ఎస్.వి. శ్రీనివాసగుప్తా, కోశాధికారి డాక్టర్ నంద్యాల రాంప్రసాద్ రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, వీఆర్‌వోలు, గ్రామ కార్యదర్శులు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి పండ్లు అందజేస్తున్న రెడ్ క్రాస్ చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు

రాష్ట్ర ఫ్లోర్ బాల్‌జట్టుకి కే-రిడ్జ్ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ఫ్లోర్ బాల్ ఉమెన్ జట్టుకి కే–రిడ్జ్ విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జీ.బర్నబాస్ శుక్రవారం తెలిపారు. 7వ తరగతికి చెందిన జుజ్జూరి ఉపగణచౌదరి, ముప్పాళ హర్షిణి, ఎనిమిదవ తరగతికి చెందిన నాటకాల గురుహంసిని లు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జూన్ 29 నుంచి జులై 1వ తేదీ వరకు మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్ లో జరిగే జాతీయ 10వ ఫ్లోర్ బాల్‌ఫెడరేషన్ కప్ ఉమెన్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను కే–రిడ్జ్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ యమ్.కిశోరుబాబు, పీఈటీ శేషగిరిరావు లు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ జీ.బర్నబాస్, ఉపాధ్యాయులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ప్రశంస పత్రాలు అందజేస్తున్న వైద్యాధికారి రావిపూడి రమ్య

శావల్యాపురం: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో 7,8,9 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య పాల్గొని మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వలన క్యాన్సర్ టీబీ ఊపిరితిత్తుల గుండె జబ్బుల సమస్యలతో బాధపడుతున్నారన్నారు.అనంతరం వ్యాసరచన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు 7వ తరగతి వేముల తనూజ, 8వ తరగతి అమృతపూడి అక్షయ, 9వ తరగతి కోతి వెన్నలకు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, సూపర్‌వైజరు అలవలపాటి ఏడుకొండలు, ఇంకొల్లు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు

పెదకూరపాడు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తల్లి పాత్రపై వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్, పాటలు, డ్రాయింగ్, కథల పోటీలను శుక్రవారం నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్, సబ్–జూనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వక్తృత్వ పోటీల్లో సీనియర్స్ విభాగంలో షేక్ ఆఫ్రోజ్, జూనియర్స్‌లో కె.దివ్యజ, సబ్ జూనియర్స్‌లో యామినీ శ్రీలు, వ్యాసరచనలో నస్రిన్, ఆఫ్రిన్, నవ్య, పాటల పోటీల్లో షాదీ, దీపిక, వెన్నెల, నాగ ఉపాసన, యాస్మిన్, డ్రాయింగ్‌లో మోహన్ గణేష్, మైనికా లక్ష్మీ, నస్రీన్, కథలలో డోలేష్, సింధు, సిమ్రన్, నాటికలలో సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు, జీఆర్‌సీఆర్‌కే విద్యార్థులు గెలుపొందినట్లు సత్యనారయణ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

పల్నాడు జిల్లా, నరసరావుపేట టౌన్, మాణికలబావి వారి వీధి, శ్రీనివాస సినిమా హాల్ దగ్గర, డోర్ నెం. 2-2-4దు గల కాపురస్తుడనయిన గ్రంధి వెంకట గోవర్దనరావు వురఫ్ గోపి అను నేను నా స్వార్జితముగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది.14.06.2005వ తేదీన కారంశెట్టి మల్లేశ్వరి గారి వలన క్రయం పొంది నరసరావుపేట యస్.ఆర్.ఓ.లో 1వ పుస్తకం డ.నెం. 5140/2005 రుగా రిజిష్టరు పొందియున్నాను. ఆట్టి దస్తావేజును జిరాక్స్ కాపీని తీసుకొనుటకు మా స్వగృహము నుండి కోట సెంటర్ కు మోటారు ద్విచక్ర వాహనముపై వెళ్ళే సందర్భంలో మార్గమధ్యమున పైన ఉదహరించిన దస్తావేజును కోల్పోవడం జరిగింది. దానిని తిరిగి నేను పొందలేకపోయాను. ఇట్టి స్థితిలో నేను ఆట్టి ఒరిజినల్ దస్తావేజును కోల్పోయినట్టుగా మీ సేవ ద్వారా నరసరావుపేట Two టౌన్ పోలీస్‌స్టేషన్ వారికి ఫిర్యాదు కంప్లైంట్ నెం. MLD 01250063?023 రుగా దాఖలు చేసియున్నాను. సంబంధిత పోలీసు వారు కూడా నా ఫిర్యాదును ప్రామాణికముగా తీసుకొని శోధించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రకటన ద్వారా నేను తెలియజేసేది ఏమనగా నేను పై దస్తావేజు నందలి ఉన్న ఆనగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నరసరావుపేట SME బ్రాంచ్ నందు తనఖా పెట్టి ఋణం పొందబోతున్నాను. కావున ఎవరైనా పైన ఉదహరించిన దస్తావేజును కనుగొనిన యెడల దయచేసి నా యొక్క మొబైల్ నంబర్‌కి (98488?2025) కాల్ చేసి తెలుపగలరు. ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి సంబంధించి ఏమన్నా అభ్యంతరములు వుంటే దయచేసి ఆట్టి అభ్యంతరములను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్యానెల్ అడ్వకేట్ అయిన శ్రీయుత బండి వీరభద్రుడు అను వారిని సంప్రదించగలరు. లేదా వారి మొబైల్ నెం. 9866436821 కు కాల్ చేసి మీ అభ్యంతరములను తెలుపగలరు. ప్రచురణ తేదీ నుండి 15 రోజులలోపు ఈ దిగువ షెడ్యూలు దాఖ లా స్థిరాస్తికి సంబంధించి అభ్యంతరములను తెలుపగలరు. ఈ 15 రోజుల కాలము దాటిన తర్వాత ఎటువంటి ఫిర్యాదులు స్వీకరించబడవు /పరిగణించబడవు.

షెడ్యూలు : పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట మున్సిపాలిటిలోని డోర్ నెం. 2-2-4 రు కల్గి, మాణికల భావి వారి వీధి, మునిసిపల్ పాత వార్డు నెం.1, కొత్త వార్డు నం.2, పాత సర్వే డ.నే.355/ఎ, నరసరావుపేట గ్రామ T.S.No.986 ద దాఖలా నాకు హక్కు కలిగిన 156.94 చ.గ.లు లేక 131.22 చ.మీ.ల స్థలమున్నూ మరియు అందలి నిర్మించబడిన లోగిలికి హద్దులు : తూర్పు: గ్రంధి వెంకట గోవర్దనరావు వురఫ్ గోపి గారి స్థలం – 28 అడుగులు, దక్షిణం: 50 అడుగులు, అడపా సుబ్బారావు గారి లోగిలి, జాయింటు గోడ, పడమర: మున్సిపాలిటీ వారి బజారు – 28.6 అడుగులు, ఉత్తరం: కాసా సుబ్బారావు గారి స్థలం – 50 అడుగులు

బండి వీరభద్రుడు
న్యాయవాది, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
సెల్ : 9866436821

న్యాయవాదుల విధుల బహిష్కరణ



సత్తెనపల్లి: న్యాయవాద పరిరక్షణ చట్టంను పటిష్టంగా అమలు చేయాలని సత్తెనపల్లి న్యాయవాదులు డిమాండ్ చేశారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్‌లో న్యాయవాది బి.శ్యామ్‌కుమార్‌పై మచిలీపట్నం డీఎస్పీ రాజు న్యాయవాదిని దూషించి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి న్యాయదేవత విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదుల ఐక్యత వర్ధిల్లాలి, న్యాయవాదులపై పోలీసు జులుం నశించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, న్యాయవాదులు కళ్ళం వీరభాస్కరరెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, జానీ ఖాజావలి, చావా బాబురావు, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, ఏవీ కృష్ణారెడ్డి, బూతు కూరి రామిరెడ్డి, ఉడుముల విద్యాసాగర్‌రెడ్డి, ఇ. ఏడుకొండలు, తవ్వా హరనాథ్, ఉల్లం మధు, కా శీమాల మార్కు, బాదినేడి శ్రీనివాసరావు, నర్రా శ్రీనివాస్, కూరపాటి శ్రీరామమూర్తి ఉన్నారు.

పెన్షనర్లకు ఉచిత నేత్ర వైద్య శిబిరం

సత్తెనపల్లి: పెన్షనర్లు ఉచిత నేత్ర వైద్య సేవలను వినియోగించుకోవాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో శుక్రవారం నరసరావుపేట డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ నేత్ర వైద్యశాల సహకారంతో పెన్షనర్స్‌కు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పెన్షనర్లు నేత్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలువురు పెన్షనర్లు నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన పెన్షనర్లకు నరసరావుపేటలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని వైద్యశాల బాధ్యులు తెలిపారు.



నేత్ర వైద్య సేవలు పొందుతున్న పెన్షనర్లు